

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 101 ఎడిటర్ : జి.రాజేష్ మంగళవారం 7 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00




## మీ మార్ట్ లతో సరికొత్త విపణి విప్లవం

- బయటి మార్కెట్ కంటే తక్కువకే సరకులు
- డీలర్లకు ఆర్థిక భరోసా.. ప్రజలకు నాణ్యమైన సరకులు
- చౌక డిపోలకు ఆధునిక కళ
- గుంటూరు రూరల్, లాలూపురంలో "మీ
- మార్టు" ను ప్రారంభించిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహార్

2లో

# పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

-పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యం-సీఎం చంద్రబాబు

## దలైలామా దీర్ఘాయుష్షుతో జీవించాలి



టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు.

అమరావతి ఐఎన్‌బిటైమ్స్

ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను

మిగతా 2లో




# నేతన్నలకు వరాల జల్లు

## మంగళగిరిలో ఘనంగా ఆప్కో స్వర్ణోత్సవ వేడుకలు

- త్వరలో 'నేతన్న భరోసా'
- రెండు విడతల్లో బకాయిలూ.. చెల్లింపు
- నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా నూలు సరఫరా
- చేనేత బ్రాండ్ అంబాసిడర్లగా చంద్రబాబు, పవన్, లోకేశ్
- మంత్రి సవిత

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

ఆప్కో స్వర్ణోత్సవం సందర్భంగా నేతన్నలకు, చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వరాల జల్లు కురిపించారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ పూర్తయిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన రూ.4 కోట్లు, వచ్చే నెల మొదటివారంలో మరో రూ.2.50 కోట్లు బకాయిలు అందజేయనున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం

మిగతా 2లో




## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

- పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి
- బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి
- కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర
- ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

2లో

## ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం

- 13నుంచి అమలుకు ఏపి ప్రభుత్వం నిర్ణయం
- పీఓ-2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం
- కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల పక్రియ

2లో



## గంజాయి సాగుచేసే వారిపట్ల కఠిన చర్యలు

- ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాల
- తీవ్రవాదులుగా గుర్తించాలి చర్యలు తీసుకుంటాం
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక

2లో



## 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం

-ముగ్గురు పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారం

-రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారుఆరోగ్యవంతమైన, సంతోషకరమైన

మిగతా 2లో



## గల్లంతైన మత్స్యకారుల కోసం సహాయక చర్యలు ముమ్మరం

- ఒక మత్స్యకారుడిని సురక్షితంగా వైజాగ్ కు తీసుకొచ్చిన నేవీ
- మిగిలిన మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగుతోంది
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2లో

# దక్షిణ కొరియా పర్యటలనో లోకేశ్

## పెట్టుబుడల కోసం పలువురితో వరుస భేటీలు



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

దక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ అయి చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో షూఆల్స్ పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్

మిగతా 2లో

# నేతన్నలకు వరాల జల్లు

తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన చేస్తున్నామన్నారు. రెండేళ్ల కూటమిపాలనలో ఆప్కో బలోపేతా నికి చర్యలు తీసుకున్నామన్నారు. మంగళగిరి లోని ఆప్కో తోటలో ఆ సంస్థ స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను చేనేత, జౌళి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆప్కో స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నా న్నారు. ఏ లక్ష్య సాధనకు ఆప్కోను ఏర్పాటు చేశారో ఆ దిశగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ జనతా వస్త్రాల పేరుతో చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమి స్తూనే, ఏపీ చేనేత రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్నారన్నారు. ఆప్కోలో చేపట్టిన డిజిటలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందన్నారు. ఆప్కోను లాభాల పట్టేలా ప్రక్షాళన చేపట్టామన్నారు. నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని, చేనేత రెడీమెడీ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణను నేతన్నలకు అందజేస్తున్నామన్నారు. నేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా డైయింగ్, బ్లీచింగ్ ఛార్జీలు, టవల్స్, ఇతర వస్త్రాల నేత ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, ఆప్కో బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రెడీమేడ్ వస్త్రాల తయారీపై చేనేతలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

**త్వరలో రూ.6.50 కోట్ల బకాయిల చెల్లింపు..**

అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ 2014-19లో సీఎం చంద్రబాబునాయుడు పాలన చేనేత రంగానికి స్వర్ణయుగం లాంటిదన్నారు. తరవాత వచ్చిన జగన్ అన్ని వ్యవస్థల మాదిరిగానే చేనేత రంగాన్ని భ్రష్టుపట్టించారన్నారు. ఆప్కో పేరు మీద తీసుకొచ్చిన రూ.100 కోట్లను జగన్ పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు ఆ బకాయి భారం ఆప్కోపై పడిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా చేనేత సహకార సంఘాల కొనుగోలు చేసిన వస్త్రాలకు నగదు చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 15న సంక్షేమ హాస్టళ్లకు అందజేసిన దుప్పట్లు, ఇతర వస్త్రాలకు చెందిన రూ.4 కోట్ల బకాయిలను చెల్లించనున్నామ న్నారు. వచ్చే నెల మొదటివారంలో సాధారణ చేనేత ఉత్పత్తులకు రూ.2.50 కోట్లను చెల్లించనున్నట్లు తెలిపారు. ఆప్కో బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆ సంస్థకు పూర్వ వైభవం తీసుకొస్తామని మంత్రి సవిత తెలిపారు.

**చేనేత బ్రాండ్ అంబాసిడర్లగా చంద్రబాబు, పవన్, లోకేశ్...**

అందరూ చేనేత వస్త్రాలు ధరించాలంటూ చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. రాష్ట్రంలో చేనేత రంగానికి ఆ ముగ్గురూ బ్రాండ్ అంబాసిడర్లగా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి మరోసారి స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. చేనేతలకు 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఏటా థ్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయించామన్నారు. 15 శాతం సబ్సిడీతో నూలు అందజేస్తున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన కూడా చేస్తున్నామన్నారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు.

## దక్షిణ కొరియా పర్యటలనో లోకేశ్



సెంటర్ ఏర్పాటు చేయాలని షూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై షూఆల్స్ ఛైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీలో రూ.300 కోట్లతో షూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్ హాతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలో సోలమ్ యూనిట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ తయారీ విస్తరణకు మంత్రి ఆహ్వానించారు. శ్రీసిటీ ఎ÷-లాంట్ పనులు వేగవంతం చేస్తామని సోలమ్ సంస్థ పేర్కొంది. రూ.338 కోట్లతో శ్రీసిటీలో సోలమ్ ఈవీ ఛార్జర్ యూనిట్ నిర్మాణం జరగనుంది. ఆపై సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్-సుంగ్ చోతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి ఐఐటీ సహకారంతో అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్‌కు ఆహ్వానం పలికారు. ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా సాఫ్ట్-ఈపీఐ సీఈవో తెలిపారు. కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపైనా మంత్రి లోకేశ్ దృష్టి సారించారు.

## పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందిం చేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారా నికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు భాద్యత తీసుకోవాలని అన్నారు.

**మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు..**

గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని సీఎం నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారుచేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దుష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం అన్నారు. మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్ద పీట..**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్థిక, ఆర్థికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కోనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించ టంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గల్లంతైన మత్స్యకారుల కోసం సహాయక చర్యలు ముమ్మరం

అమరావతి, విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకార పడవలోని ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ తదితర సంస్థలు సమన్వయంతో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇప్పటికే పడవ యజమాని కర్రి చిన్నను ఎంవీ యూనివర్స్ వెల్తీ అనే వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని మంత్రి తెలిపారు. అనంతరం భారత నౌకాదళం, భారత కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సమన్వయంతో భారత నౌకాదళానికి చెందిన హెలికాప్టర్ ద్వారా ఆయన్ను వాణిజ్య నౌక నుంచి ఎయిర్‌లిఫ్ట్ చేసి సోమవారం సాయంత్రం ఐఎన్ఎస్ డేగా, విశాఖపట్నంకు సురక్షితంగా తరలించారని చెప్పారు. ప్రస్తుతం కర్రి చిన్న క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్య చికిత్స కోసం గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన గాలులు, ఎత్తైన అలలు ఉన్నప్పటికీ గాలింపు చర్యలు ఏమాత్రం తగ్గకుండా కొనసాగుతున్నాయని మంత్రి అచ్చెన్నా యుడు తెలిపారు.

వైమానిక నిఘా, ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ కూడా కొనసాగు తోందని పేర్కొన్నారు. కోస్టల్ సెక్యూరిటీ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ అన్ని శాఖల మధ్య సమన్వయం చేస్తున్నారని మంత్రి తెలిపారు.

## గంజాయి సాగుటేసే వారిపట్ల కఠిన చర్యలు



భద్రాద్రి కొత్తగూడెం,జూలై6: రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యా చరణ రూపొందిస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే దాడులు చేపట్టి పెద్ద ఎత్తున అరికట్టే చర్యలు చేపట్టామని అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణు గూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాటా డుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగును చేసే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

## ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం

అమరావతి,జూలై6: ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటాయింపు పక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ-2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ (హెచ్ఆర్-ఎలానింగ్-పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీ చేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల పక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన పక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం

కుటుంబాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో ఈసారి ప్రచారం సాగనుందని తెలిపారు. గర్భధారణకు సరైన సమయాన్ని ఎంచుకోవడం, కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు కలుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో మూడు జంటల(మొత్తం 54 జంటలు)కు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామని తెలిపారు. కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరు జంటలకు పై విధంగానే రూ.5వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎశీపిక చేస్తామని తెలిపారు.

కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

హైదరాబాద్,జూలై6 ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

## మీ మార్ట్ లతో సరికొత్త విపణి విప్లవం

గుంటూరు, బహిరంగ మార్కెట్లోని సరకుల ధరల కంటే అతి తక్కువ ధరకే మీ మార్టుల్లో అందుబాటులో ఉండాలి. సుమారు 30 వేల చౌకడిపోల డీలర్ల కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం పెరగాలి. ప్రజా ప్రయోజనం విస్తృతంగా ఉండాలి.. ప్రజలకు మేలు చేసే వినూత్నం ప్రయోగం మొదలుపెట్టాలనే లక్ష్యంగా "మీ మార్టు "లకు రూపకల్పన చేశామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మీ మార్టులకు స్వల్పకాలిక ప్రయోజనాల కంటే, ప్రజాధనం ఆదాకు, భవిష్యత్తు విపణి పెరుగుదలకు నూతన దశను చూపే మార్గాలుగా నిలుస్తాయన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టనున్న 1000 మినీ మార్టు (మీ మార్టు)ల్లో భాగంగా మొదటి మీ మార్టును గుంటూరు జిల్లా, లాలూపురం 1వ నంబరు చౌకడిపోనకు అనుసంధానంగా సోమవా రం మంత్రి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీలో సాంకేతిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మీ మార్టులు బాటను వేస్తాయి. ప్రజలకు మీ మార్టుల్లో నాణ్యమైన సరకులు అందుతాయి. ఇవి బయటి మార్కెట్ ధరలు, వివిధ మార్టుల్లో లభించే ధరలు కంటే తక్కువగా ఉంటాయి. ప్రజలు రోజువారీ ఉపయోగించే సరకులు, వస్తువులన్నీ దీనిలో అందుబాటులో ఉంటాయి. చౌకడిపోలకు అనుసంధానంగా పనిచేసే ఈ మార్టులు కేవలం బియ్యం, గోధుములు అమ్మేవి మాత్రమే కావు 250 కు పైగా సరకులు వీటిలో లభిస్తాయి. దీన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా డిజైన్ చేశాం.

# కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

## వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

ఐ ఎన్ బి టైమ్స్ జగ్గయ్యపేట జూలై 6: నిరుపేద వర్గాల సంక్షేమానికి, పోషకాహార లోప నిర్మూలనకు నిరంతరం శ్రమిస్తున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో కాకాని నగర్ లో ఉన్న ట్రస్ట్ కార్యాలయమలో నిర్వహించిన సేవా కార్యక్రమం లో పాల్గొన్నారు, అనంతరం పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు, వృద్ధులకు ?10,000 (పది వేల రూపాయలు) విలువైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ శ్రీ రామానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న పౌష్టికాహార పంపిణీ తో పాటు మానవతా దృక్పథంతో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సహాయం అందచేస్తున్నట్టు తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న షేక్ ఇమామ్ అనే వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ?2,000 (రెండు వేల రూపాయల) చెక్కును అందజేశారు. అలాగే ప్రభావతి అనే మహిళకు ఆర్థిక ఆసరాగా మరో ?2,000 (రెండు వేల రూపాయల) చెక్కును అందజేసి ఆయా కుటుంబాలకు ధైర్యాన్ని నింపారు. ఈ ట్రస్ట్ ప్రతి మాసము క్రమం తప్పకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. సమాజ శ్రేయస్సుకై నిరంతరం సాగుతున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అత్యంత అభినందనీయమని హాజరైన పలువురు వైఎస్ఆర్సిపి



నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ మున్సిపాలిటీ వింగ్ అన్నేపాక ప్రవీణ్, 31 వ వార్డు అధ్యక్షులు మన్నే అప్పారావు, వేల్పుల ప్రసాదు, దారెల్లి రాజు, ట్రస్ట్ అడ్వైజర్ కారంగుల రామకృష్ణ , రాయపూడి వెంకటేశ్వరా రావు, డి రామచందర్, పి. శ్రీనివాస రావు, శ్రేయస్సు ప్రతినిధులు లక్ష్మి, ట్రస్ట్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు. బి

## 35 ఏళ్ల సేవా ప్రస్థానానికి అరుదైన గౌరవం

### .. మందలపు సాయిబాబా చౌదరికి డాక్టరేట్..



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 6 , 2026 పాండిచ్చేరిలోని కమ్మన్ కళాక్షేత్రంలో నిర్వహించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్సీ వారి అవార్డుల ప్రదానోత్సవంలో, హైదరాబాద్ కూకట్పల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, వ్యాపారవేత్త మందలపు సాయిబాబు చౌదరి కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. గత 35 సంవత్సరాలుగా ప్రజా, రాజకీయ రంగాల్లో నిరంతరం ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న మందలపు సాయిబాబు చౌదరి కరోనా, స్వైన్ ఫ్లూ వంటి మహమ్మారులు, హుద్హుద్, తిత్లీ వంటి తుఫాన్లు, వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలిచారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాల్లో బాధితులకు అత్యవసర సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు విద్యా సహాయం, నిరుపేదలకు వైద్య సహాయం, ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణ, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వ్యాపార రంగంలోనూ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అందుబాటు ధరల్లో గృహాలను నిర్మించి ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. ప్రజాసేవ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సేవా తపనను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్సీ సంస్థ మందలపు సాయిబాబు చౌదరి ని గౌరవ డాక్టరేట్తో సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సేవనే జీవిత ధ్యేయంగా కొనసాగిస్తున్న మందలపు సాయిబాబు చౌదరి కి ఈ గౌరవ డాక్టరేట్ రావడం ఎంతో సముచితమని కొనియాడుతూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న లెనిన్ బృందం



తిరుమల,జూలై6: లెనిన్ సినిమా విడుదల సందర్భంగా అక్కినేని నాగార్జున, అమల, అఖిల్, సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదా ఆశీర్వచనం అనంతరం శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాజీపేటలో అనూహ్య ఘటన

### వీడియో కాల్లో చూపి వ్యక్తి ఆత్మహత్య

వరంగల్,జూలై6 కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో తీవ్ర కలకలం రేపే ఘోర సంఘటన వెలుగుచూసింది. మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి తన భార్యకు మొబైల్లో వీడియో కాల్ చేసి, తానేం చేయబోతున్నాడో లైవ్లో చూపిస్తూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళ్ళెదుటే భర్త ప్రాణాలు కోల్పోవడాన్ని చూసి సదరు భార్య, కుటుంబ సభ్యులు తీవ్ర షాక్కు గురయ్యారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరంగల్ ప్రాంతానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ రాజేష్ నాయక్ (45) గా గుర్తించారు. గత కొంతకాలంగా రాజేష్ నాయక్ కుటుంబంలో ఆస్తి పంపకాల విషయమై తీవ్రస్థాయిలో మనస్పర్థలు, ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఈ వ్యవహారం సర్దుమణగకపోవడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి కూడా ఆస్తి పంపకాల విషయమై భార్యతో రాజేష్ నాయక్కు తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఆగ్రహంతో ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయారు. ఇంట్లోంచి నేరుగా కాజీపేట రైల్వే ట్రాక్ సమీపానికి చేరుకున్న రాజేష్ నాయక్.. రాత్రి వేళ తన భార్యకు స్మార్ట్ఫోన్ ద్వారా వీడియో కాల్ చేశారు. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు భార్యకు చెబుతూ.. కదిలివస్తున్న రైలు కింద పడి క్షణాల వ్యవధిలో తనువు చాలించారు. ఫోన్ కట్ చేసే లోపే ఈ ఘోరం జరిగిపోవడంతో భార్య కేకలు వేస్తూ బంధువులకు సమాచారం అందించారు. ఈ లోగా సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాల వల్ల ఒక నిండు ప్రాణం ఇలా అర్ధాంతరంగా రైలు పట్టాలపై బలికావడం స్థానికంగా తీవ్ర శోకాన్ని నింపింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

## నిర్లక్ష్యంగా బిఎల్వోల వ్యవహారం

హైదరాబాద్,జూలై6 బీఎల్వోలు రాష్ట్ర వ్యాప్తంగా సక్రమంగా పని చేయటం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఎన్నిక లసంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని వినోద్ కుమార్తో పాటు బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ ఎల్. రమణ, సోమా భరత్, కర్నె ప్రభాకర్, వై సతీష్ రెడ్డి, సుమిత్రానంద్ కలిశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ పక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున సీఈవోకు వినపతి పత్రం అందించామన్నారు. సర్ కోసం బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రత్యేక కమిటీ వేసింది. ఈ కమిటీ బీఎల్వోలు, బీఎల్ఏలతో కలిసి పనిచేయటం కోసం వీళ్లని నియమించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా వినతులు మాకు వచ్చాయి. అవన్నీ సీఈవో సుదర్శన్ రెడ్డికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్ ఓటర్లకు ఇవ్వడం లేదు. చాలా మందికి ఇంకా ఫామ్ అందలేదన్నారు. 20 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇంకా సమయం పెంచాలని సీఈవోను కోరినట్లు ఆయన వివరించారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఈ విషయాలు వెల్లడిస్తామని చెప్పారు. డూప్లికేట్ ఓట్లు విషయంలో సరైన చర్యలు తీసుకోవాలని కోరాం. ఇక్కడ అక్కడ రెండు ఓట్లు ఉన్నాయి. అలాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు తీసుకోలన్నారు. దీనిపై అవగాహన కల్పించాలి అని సూచించారు. అలాగే పేర్ల విషయంలో గందరగోళం ఉంది. వీటిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని, బీఎల్వోలకు తగిన సూచనలు చేయాలన్నారు.

## పివోకేలో మళ్లీ నిరసనలు

**- రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు**
**-పాక్ దళాల కాల్పుల్లో మరొకరు మృతి**
**-భారత్ సాయం కొందరి అభ్యర్థన**

శ్రీనగర్,జూలై6 పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతు న్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచివేసేం దుకు పాక్ కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక్ ప్రభుత్వ అణిచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది.

## సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేయాలి

### జె ఎన్ టి యుహెచ్ వైస్-ఛాన్సలర్



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 6జెఎన్టియుహెచ్ వైస్-ఛాన్సలర్ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, జూలై 6న ప్రారంభమై 2026 ఆగస్టు 11 వరకు కొనసాగే 'స్పెషల్ సప్లిమెంటరీ (వన్-టైమ్ ఛాన్స్)' పరీక్షల ఏర్పాట్లను పరిశీలించేందుకు యూనివర్సిటీ పరీక్షల విభాగం (ఐఐఈఈ) కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మొత్తం 17,267 సబ్జెక్టులకు సంబంధించి 4,399 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన యూనివర్సిటీ పరీక్షల విభాగం కార్యకలాపాలను సమీక్షించి, ఆ విభాగం యొక్క ప్రస్తుత భవిష్యత్తు అవసరాల గురించి ఆరా తీశారు. ఈ తనిఖీ సమయంలో ఐఐఈఈ డైరెక్టర్ డాక్టర్ జి. కృష్ణ మోహన రావు మరియు పరీక్షల నియంత్రణాధికారి (Controller of Examinations) డాక్టర్ కె. భాస్కర్ పాల్గొన్నారు.

## గుక్కెడు శుద్ధమైన త్రాగు నీరు ఇవ్వండి మహాప్రభో

### BSP MPTC బర్రె ఉదయ్ కిరణ్



ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల జూలై 7 : స్థానిక కంచికచర్ల గ్రామం 6 వ సెగ్మెంట్ లోని ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్నటువంటి త్రాగునీటి సమస్యను త్వరితగతిన తీర్చాలని కోరుతూ ఈరోజు స్థానిక బీఎస్పీ బర్రె ఉదయ్ కిరణ్, అంబేద్కర్ యూత్ తో కలిసి కంచికచర్ల గ్రామ పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ వెంకట రామారావు కి వినతిపత్రం అందజేశారు. ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ స్థానిక అంబేద్కర్ కాలనీలోని కొన్ని ప్రదేశాలలో తగినంత ప్రభుత్వ మంచినీటి కుళాయిలు లేనందున ప్రజలు అనేక అవస్థలు, ఇబ్బందులు పడుతున్నారు అని తద్వారా ఎక్కడైతే అవసరం ఉన్నదో అక్కడ సత్వరమే మంచినీటి కుళాయిలు ఏర్పాటు చెయ్యాలని ఆయన కోరారు. అదేవిధంగా కొన్ని వీధుల యందు మంచినీరు వదలగా అవి దుర్గంధమున వాసనతో నిండి, కలుషితం అయ్యి పూర్తిగా రంగు మారి వస్తున్నాయి అని వాటి ద్వారా ప్రజలు అనారోగ్యాల పాలయ్యి ప్రాణాలు విడిచే ప్రమాదం ఉన్నది అని తెలియచేస్తూ అటువంటి ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టాలని. సెగ్మెంట్ లోని ప్రజలను త్రాగడానికి శుద్ధమైన గుక్కెడు త్రాగునీరు ఇస్తే చాలు అని ఉదయ్ తెలిపారు. కాలనీలోని ప్రజలు రోజు వారు కూలి పనులు చేసుకుంటూ జీవించే కూలీలు అవడం చేత త్రాగునీటిని ఉదయం 7 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత తాగునీటిని వదలాలని కోరారు. దీనితోపాటుగా అవసరం ఉన్నటువంటి ప్రదేశాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కావునా అధికారులు అలసత్వం, అశ్రద్ధ వహించకుండా త్వరగతిన ప్రజాప్రయోజన అవసరాలు తీర్చాలని ఉదయ్ కిరణ్ విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో యాదల. కుటుంబ రావు, గారపాటి. సూర్యవంశీ, బడుగు కోటి పాల్గొన్నారు.

## జేఎన్టీయూహెచ్లో "ఇంటెలిజెంట్ సర్వీస్ రోబోట్స్" పై ఒక వారం ఆన్లైన్ స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమం ప్రారంభం




ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 6యూజీసీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహె చ్)లో నిర్వహిస్తున్న "ఇంటెలిజెంట్ సర్వీస్ రోబోట్స్" పై ఒక వారం ఆన్లైన్ స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాన్ని జేఎన్టీయూహెచ్ రెక్టార్ డా. ఎ. దామోదరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్ డా. ఎం. సుషమా, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డా. కె. ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 2026, జూలై 6 నుండి జూలై 13 వరకు జరగనుంది. ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. ఎ. దామోదరం, ప్రస్తుత యుగంలో రోబోటిక్స్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోషిస్తున్న కీలక పాత్...

## డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్



ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్గ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

## నాగార్జున వందో సినిమాలో టబూ



### నెగెటివ్ షేడ్‌లో ఉంటుందుంటూ ప్రచారం


టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## 10న విడుదలవుతున్న లెనిన్

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది.


ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷-లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




## ఇరుముడితో బిజీ..అయినా కొత్త సినిమాపై దృష్టి

### శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవతేజ యత్నం

మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.




ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.

దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.